క్లుప్తంగా

సుబ్రహ్మణేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి

పిడుగురాళ్ల: పట్టణం లోని పిల్లుట్ల రోడ్డులో ఉన్న నాగుల గుడిలో బుధ వారం శ్రీ సంతాన సుబ్రహ్మణేశ్వరస్వా మికి ప్రత్యేక అభిషే కాలు నిర్వహిం చారు. ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ ప్రత్యేక సుగంధా లతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం పలు రకాల పూలతో ప్రత్యేకార్చన చేశారు. భక్తులు విశేషంగా హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

మోటార్లు, వీధి లైట్లకు స్విచ్ బోర్డుల ఏర్పాటు



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడులో నీళ్ల మోటర్లు, వీధిలైట్ల వద్ద కరెంటు ఆదా చేసేం దుకు నాలుగు చోట్ల స్విచ్ బోర్డులను బుధ వారం వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పసుపు లేటి నరసింహారావు, పోలిశెట్టి శ్రీనివాసరావు, శివారెడ్డి పాల్గొన్నారు.

హాజరుతో నిమిత్తం లేకుండా పరీక్షకు హాజరుకావొచ్చు

దాచేపల్లి : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్స రంలో హాజరుతో నిమిత్తం లేకుండా విద్యా ర్థులు పరీక్షలు రాయవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా ఇంటర్నెట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడు చేసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని ఆయన సూచించారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

పిడుగురాళ్ల: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిం చనున్నట్లు చైర్మన్, జడ్జి ఎం. మురళీ గంగాధ రరావు బుధవారం తెలిపారు. కేసుల్లో రాజీ పడ దలిచిన కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

19న క్రికెట్ పోటీలు ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ పక్కన ప్రాంగణంలో ఈ నెల 19న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమ వుతాయని ఆర్గనైజర్ కొమ్మా మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. విజేతకు మొదటి బహు మతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ. 60 వేలు, మూడో బహుమతిగా రూ. 30 వేలతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7013506125, 9989918990 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య



నరసింహాచారి మృతదేహం

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ కుడి జల విద్యుద్ కేంద్రం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. హైద రాబాద్‌లోని సరూర్‌నగర్ పరిధిలోని గుర్రంగూ డకు చెందిన నరసింహాచారి(72)సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రం సమీపంలోని చెట్టుకు వేలా డుతూ ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విజయపురిసౌత్ ఎస్‌ఐ పి. అనిల్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

రెంటచింతల: నిర్లక్ష్యంగా ఆటోల్ని నడపడం ద్వారా జరిగే ప్రమాదాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని ఎస్‌ఐ సయ్యద్ సమీర్ బాష తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రెంటచింతలకు చెందిన ఆటోవా లాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటి దగ్గర ఒక కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకునే వారిపై కఠి నమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ చేయడానికి వీల్లేకుండా ఒక్కో ఆటోలో 15 నుంచి 25 మంది వ్యవసాయ కూలీల్ని ఎక్కిం చుకుంటున్నారని, ఇది చాలా ప్రమాదకరమని తెలిపారు. ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, లేనిపక్షంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరిం చారు. డ్రైవింగ్ చేసే సమయంలో కచ్చితంగా యూనిఫాం ధరించాలని చెప్పారు. కేటాయిం చిన ప్రాంతంలో మాత్రమే ఆటోలను నిలుపుకో వాలని సూచించారు. కొందరు బస్టాండ్ వద్ద నిలిపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందని, ఇలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాడు అరాచకం- నేడు సంక్షేమం

- సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లాలి
- గురజాల ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు అరాచకం, దుష్ట పాలన సాగిందని, నేడు ప్రతి గడపకూ సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. మాచవరం జెడ్పీ హైస్కూలులో సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత నాడు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేసిన అరాచకాలు, అకృత్యాలను వీడియో రూపం లో ప్రజలకు తెలియజేశారు. అనంతరం సభలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు దుష్ట పాలనపై పోరాటం చేసి అధిక సీట్లు సాధించి అధికారం చేపట్టామన్నారు. నేడు అధికారంలో ఉంటూ చేసిన అభివృద్ధిని, అందిం చిన సంక్షేమాన్ని ప్రజలకు చేరవేస్తే చాలు మరలా అధికారం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. అభివృ ద్ధి చేస్తామని మాట ఇసేస్తే 151 సీట్లు ఇచ్చారని, నాలుగేళ్ల అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రతి గడ పకూ తెలియజేస్తే 2024లో వైఎస్సార్ సీపీకి 175 సీట్లు రావడం తథ్యమని తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలో మొట్టమొదటిగా గురజాల నియోజకవర్గం నుంచే సచివాలయ వ్యవస్థను అమలు చేశామని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నదం టే, అది కార్యకర్తల ఆత్మస్థైర్యం, మనోబలమే కార ణమని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ కన్వీన ర్లు , గృహ సారథులు బాధ్యతగా పని చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి, ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజ కవర్గంలో వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి 25 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. ఇచ్చిన హామీలు ఇప్పటికే 95 శాతం నెరవేర్చామని, ఈ విషయం ప్రతి ఇంటికీ తెలియజేస్తే వచ్చే 2024 ఎన్నికల్లో 24 వేలు కాదు, 45 వేల మెజార్టీతో గెలు స్తామని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వలంటీర్ వ్యవస్థను అవహేళన చేస్తూ మాట్లాడారని, ఈరోజు అదే వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల్ని సీఎం జగన్‌మోహ న్‌రెడ్డి అందిస్తున్నారని వివరించారు. గతంలో ఏ పని జరగాలన్నా, సమస్యలు పరిష్కారం కావా లన్నా, మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టు చెప్పులు అరిగేలా తిరగాల్సి దుస్థితి ఉండేదని తెలి పారు. నేడు ఇబ్బందులు లేకుండా గ్రామంలోనే అందుబాటులో సచివాలయంలో ప్రతి సమ స్యనూ పరిష్కరిస్తూ ప్రజా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా విప్ల వాత్మక మార్పులు తీసుకువచ్చే నాయకుడు ఒక్కరే ఉంటారని, అలాంటి నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని, అది సచివాలయ, వలం టీర్ వ్యవస్థ ద్వారా నిరూపితమైందని పేర్కొ న్నారు. నేడు ప్రతి సంక్షేమ పథకం అవినీతి లేకుం డా ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించడమే సీఎం జగ న్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సింగరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు శివ యాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు నన్నే, లక్ష్మయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రమేష్, రాష్ట్ర సర్పం చుల సంఘ ఉపాధ్యక్షుడు అల్లాబక్షు, మండల నాయకులు సైదా, అనిల్, నరసింహారెడ్డి, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు: ఎమ్మెల్యే కాసు



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: నియోజక వర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నామని శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండ లంలోని రేగులగడ్డలో బుధవారం గడప గడ పకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి గ్రామ మహిళలు హారతులు పట్టారు. గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నూతనంగా నిర్మిం చిన పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేగులగ డ్డలో మౌలిక సదుపాయాల, వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇప్పటికే రూ. 20 లక్షలతో పాఠశాల భవనాన్ని నిర్మిం చామని, చర్చిలకు మరో రూ.12 లక్షలు మం జూరు చేశామని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.40 లక్షలు, ఇంటింటికీ మంచి నీటి వసతికి మరో రూ.40 లక్షలతో పనులు చేపట్టి, పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చిం చి, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తు న్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రతి ఇంటికీ మంచి నీటికి అందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి, పనులు చేపడుతు న్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో నూరు శాతం అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించి, పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటిని దర్శించారు. గ్రామంలో చేసిన అభివృ ద్ధిని, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను అందజే శారు. ప్రజల సమస్యల్ని వింటూ, వాటిని పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ సురేష్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర రెడ్డి, ఈఓఆర్డీ వెంగళరావు, మండల కన్వీనర్ సింగరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు శివ యాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి , వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నే, గ్రామ సర్పంచ్ అల వాల లక్ష్మీ, వైస్ సర్పంచ్ జక్కుల కొండలు, మాజీ సర్పంచులు తిక్కా నాగేశ్వరావు, అలవాల గోవిం దు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముక్కంటి, యల మంద, లక్ష్మయ్య, శ్రీను, సత్యానందం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నాదేవి రోడ్డులో 'కాశీనగర్ 1947' సినిమా షూటింగ్



షూటింగ్‌లో ఫైట్ సన్నివేశం

సత్తెనపల్లి: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యాన ర్‌పై రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మాతగా వ్యవ హరిస్తూ నిర్మిస్తున్న కాశీనగర్ 1947 సినిమా షూటింగ్ బుధవారం సత్తెనపల్లి మండలం వెన్నాదేవి రోడ్డులో జరిగింది. ఇక్కడ ఉన్న ఇటుక బట్టీల్లో ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్న వల్లెం చెన్నకేశవ నాయుడు, జగన్నాథ పట్నాయక్‌పై కొన్ని సన్నివేశాలతో పాటు జబర్దస్త్ చిట్టిబాబు, హీరో దిలీప్ రాథోడ్, శివ, విఠల్, ఓంకార్, రాము లపై కొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. వడ్ల వల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో నటి మానస, చెన్నకేశవ నాయుడులపై మరికొన్ని సన్నివేశాల్ని చిత్రీకరించారు. లక్కరాజుగార్లపాడు ఇటుక బట్టీల్లో ఫైటింగ్ సన్నివేశాల్ని చిత్రీకరిం చారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకుడిగా చిత్తజల్లు ప్రసాద్ వ్యవహరిస్తు న్నారు. కెమెరామెన్‌గా జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ, సంగీత దర్శకుడిగా లక్ష్మణ సాయి, పాటల రచయితలుగా జి. సీతారామ చౌదరి, ఎల్ ఐసీ రఘుబాబు, ఫైట్స్ మాస్టర్‌గా హుస్సేన్ బాయ్, కొరియోగ్రాఫర్‌గా బండ్ల రామారావు పని చేస్తున్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



శాస్త్రీనగర్‌లో అవగాహన కలిగిస్తున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు, లీగల్ వలంటీర్లు

సత్తెనపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాస రావు తెలిపారు. పట్టణంలోని 16వ వార్డు శాస్త్రీనగ ర్‌లో బేడ బుడిగి జంగాలు నివసించే ప్రాంతంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ అరెస్ట్, బెయిల్ ,రిమాండ్ తదితర అంశాల గురించి వివరించారు. వ్యక్తిని అరెస్ట్ చేసిన 24 గంటల్లో న్యాయమూర్తి ముందు హాజరు పెట్టాలని తెలిపారు. ఈ ప్రాంతంలో నివాసం ఉండే గోవిందమ్మ అనేక ఏళ్లుగా రేషన్ కార్డు లేక ఇబ్బం దులు పడుతున్న విషయాన్ని సత్తెనపల్లి పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజాల దృష్టికి తీసు కురాగా వారు సంబంధిత అధికారులతో మాట్లాడి ఎనిమిది రోజుల్లోనే వారు మంజూరు చేయించారు. కార్డును బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సులో అం దించడంతో గోవిందమ్మ ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో పలువురు బేడ బుడిగి జంగాలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన

జిల్లా వ్యవసాయాధికారి మురళి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయా ధికారి మురళి, పలువురు అధికారులు

నకరికల్లు: రైతుభరోసా కేంద్రాల్లో పంట నమోదు ముసాయిదా జాబితాలను ప్రదర్శనలో ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌కు గానూ గుండ్లపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రదర్శించిన జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ పంట నమోదు, ఈకేవైసీ నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం ద్వారా అంద జేసే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీలు పొందవచ్చని తెలిపారు. ముసాయిదా జాబితాలను ఈనెల 13వ తేదీ నుంచి 17 ప్రదర్శించే ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పంట నమోదులో వ్యత్యాసాలు ఉంటే ఈ-సోషల్ ఆడిట్ ద్వారా సరి చేసుకో వచ్చని సూచించారు. అనంతరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వ హించి, రైతులకు సాగులో మెలకువల్ని వివరిం చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ వ్యవ సాయ సంచాలకులు రవికుమార్, పిడుగురాళ్ల సబ్ డివిజన్ ఏడీఏ బత్తుల శ్రీకృష్ణదేవరాయలు, డీఆర్‌సీ వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, మం డల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవ సాయ సహాయకుడు ఎం.ప్రసన్నకుమార్, సిబ్బం ది, రైతులు పాల్గొన్నారు.

డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించండి

సత్తెనపల్లి: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి డిపాజిట్ల సేకర ణపై దృష్టి సారించాలని నర్సరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయంలో ఏజెంట్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోస్టాఫీసు పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పోస్టాఫీసు పొదుపు పథకాలైన రికరింగ్ డిపాజిట్, నేషనల్ సేవింగ్స్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమాలో పెట్టుబడి పెడితే సొమ్ముకు భద్రత ఉం టుందని చెప్పారు. సమావేశంలో పోస్టుమాస్టర్ జె. రామకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ వృద్ధుల ఆశ్రమం లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముప్పాళ్ల మండలం ఇరుకుపాలేనికి చెందిన చిన్నారి వర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు బాల కృష్ణ, రమ్య అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లి బాబు, సభ్యులు మల్లేశ్వరి, కె.సురేష్, నాని, సోమశే ఖర్, నిర్వాహకులు రిషిత పాల్గొన్నారు.


రబీలో ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

అచ్చంపేట: రబీలో సాగు చేసిన పంటల్ని రైతులం తా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకో వాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణా బేగం సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం లో బుధవారం ఆమె రైతులతో మాట్లాడి ఈ- క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించారు. ఈ- పంట నమోదుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. జాబితాలో పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీని మార్చి 30లోగా చేయించుకోవాలని సూచించారు. మండలంలో రబీ సీజన్‌లో 881 ఎక రాల్లో ప్రధానంగా మొక్కజొన్న, శనగ, మినుము, వరి, పొగాకు, నువ్వులు, ఆముదం తదితర పంట ల్ని రైతులు సాగు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అమరజీవి జయంతి వేడుకలు

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్ని పట్టణంలోని గాంధీ చౌక్‌లో గల గాంధీ విగ్రహాల వద్ద గురువారం ఉదయం 8.30 గంట లకు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామచెంచయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతు లసి హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలం తా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు.

క్రోసూరు: సచివాలయ ఉద్యోగులంతా సమయ పాలన పాటించాలని, నిత్యం ప్రజలకు అం దుబాటులో ఉండాలని తహసీల్దార్ డి.శ్రీనివాస రావు ఆదేశించారు. క్రోసూరులోని సచివా లయం-1, 2, పెరిక పాడు సచివాలయాలను ఆయన బుధవారం సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. అనంతరం క్రోసూరులో రైతు బెజ్జంకి నారాయణ, దొడ్లేరులో షేక్ మస్తాన్‌బీ పొలాల వివాదాలపై ఇచ్చిన ఫిర్యాదుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. పెరికపాడులోని సచివాలయాన్ని సందర్శించి, అక్కడి వీఆర్వోకి ఓటర్ల ఐడీకి ఆధార్ అనుసంధానంపై పలు సూచనలు చేశారు.

ఇంటర్ ప్రథమ పరీక్షలు ప్రారంభం



కారెంపూడిలో స్క్రీన్‌పై పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

పిడుగురాళ్ల: పట్టణంలో ఇంటర్‌మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమ య్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆక్స్‌ఫర్డ్ స్కూలు, స్కాలర్స్ పాఠశాల, శ్రీ చైతన్య స్కూలులోని కేంద్రాల్లో 1,550 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాతంగా జరిగాయి.

విజయపురిసౌత్‌లో...

స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో బుధవారం 250 మంది విద్యార్థులకు గాను 249 మంది హాజర య్యారు. ఉదయం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలకు 180 మంది ఏపీఆర్‌జేసీ విద్యార్థులు, బ్యాక్‌లాగ్ విద్యార్థులు ముగ్గురు, అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు 69 మంది హాజర య్యారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. చీఫ్ సూప రింటెండెంట్‌గా జి. రంగాచార్యులు, డిపార్ట్‌మెం టల్ ఆఫీసర్‌గా మల్లికార్జునరావు వ్యవహరించారు. ఎస్‌ఐ పి. అనిల్‌కుమార్‌రెడ్డి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటిక ప్పుడు పర్యవేక్షించారు.

కారెంపూడిలో...

స్థానిక మోడల్ స్కూలు కేంద్రంలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 237 మంది విద్యార్థులకు గానూ తొమ్మిది మంది గైర్హాజరయ్యారని తహసీల్దార్ జె. శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్రంలో అంబేడ్కర్ గురు కుల కళాశాల, మోడల్ స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులు పరీక్షలు రాస్తు న్నట్లు ఆయన చెప్పారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, అన్ని రూంలలో సీసీ కెమెరాల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గురజాలలో..

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పల్లె గుంత మోడల్ స్కూలులో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 370 మంది విద్యార్థులకు గాను 19 మంది గైర్హాజరయ్యారు. ఏపీ మోడల్ స్కూలులో 327 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజర య్యారు.

భూ రీసర్వే బృందాలకు రైతులు సహకరించాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అద్దయ్య

రెంటచింతల: గ్రామాల్లో పర్యటించే భూ రీసర్వే బృ ందాలకు రైతులు సహకరించాలని గురజాల ఆర్డీవో అద్దయ్య కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ వివాదాలను పరిష్కరిం చడమే ఈ సమగ్ర సర్వే ప్రధాన ఉద్దేశమని తెలి పారు. రీ సర్వే సమయంలో రైతులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫోటో, సెల్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలను కచ్చితంగా ఆయా గ్రామాల వీఆర్వో లకు అందజేయాలని సూచించారు. సర్వేను సకా లంలో పూర్తి చేయడానికి ప్రతి గ్రామానికి వీఆర్వో, సర్వేయర్, సచివాలయ సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు దశల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు వెల్లడిం చారు. సర్వే ప్రక్రియలో ముందుగా డ్రోన్స్, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్లు సమకూర్చుకుని నాలుగు కీలక పనుల్ని పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. భూముల వద్దకు వచ్చే సర్వే బృందాలకు రైతులు సరిహద్దు రాళ్లను చూపించి సహకరిం చాలని కోరారు. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో త్వరలో రీసర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముందుగా మండలంలోని పశర్లపాడులో మొద లుపెట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహ సీల్దార్ కట్టేకోట పుల్లారావు, ఆర్ఐలు దాసరి కాం తారావు, జె.రాజారావు, మండల సర్వేయర్ సుధా కర్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ డాన్ యరపతినేని

వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి

దాచేపల్లి : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్ డాన్ యరపతినేని శ్రీనివాస రావు అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి ఆరోపించారు. నారాయణపురంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై యర పతినేని వ్యాఖ్యల్ని రమేష్‌రెడ్డి తీవ్రంగా ఖండిం చారు. టీడీపీ ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ జర గడం వల్లే యరపతినేనిపై సీబీఐ కేసు నమోదు అయ్యిందని తెలిపారు. నడికుడి పారిశ్రామికవా డలోని ముగ్గు మిల్లులన్నింటిని మూసేసి, యరప తినేని అనుచరులు మాత్రమే మిల్లులు నడిపిం చటం వాస్తవం కాదా ? అని ఆయన ప్రశ్నిం చారు. మిల్లర్లను బెదిరించి యరపతినేని డబ్బులు వసూలు చేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అర్జీ పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మైనింగ్ లీజు ఇప్పించి చట్టబద్ధంగా క్వారీ పనులు చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. పార్టీ లకు అతీతంగా నడికుడి పారిశ్రామికవాడలో ముగ్గు మిల్లులన్నీ పని చేస్తున్నాయని రమేష్ రెడ్డి చెప్పారు. క్వారీల్లో పనులు చేసుకుంటూ స్థానికులు ఉపాధి పొందుతున్నారని, అభివృ ద్ధి, సంక్షేమం, ఉపాధి విషయంలో సమర్థంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కాసుపై యరపతినేని వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



లక్కరాజు గార్లపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ యోగి రాఘవేంద్ర, సిబ్బంది



దమ్మాలపాడులో సేవలందిస్తున్న వైద్యుడు సూర్యప్రకాశరావు, సిబ్బంది

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా సత్తెనపల్లి మం డలం లక్కరాజు గార్లపాడులో బుధవారం 165 మందికి వైద్యసేవల్ని అందించారు. సత్తెనపల్లి మం డలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యా ధికారి డాక్టర్ యోగి రాఘవేంద్ర 104 వాహనంలో సిబ్బందితో వెళ్లి గ్రామంలో శిబిరంతో పాటు, రాలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్యసేవలపై అవగా హన కల్పించారు. ఆరోగ్య జాగ్రత్తల్ని వివరిం చారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ జె.సంపూర్ణా దేవి, సీహెచ్ఓ కె.సురేష్ కుమార్, ఏఎన్ఎం పి.మేరీరాణి, ఆశా కార్యకర్తలు సుధా, షారోన్, విజ యలక్ష్మి పాల్గొన్నారు.

దమ్మాలపాడులో సేవలు

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మా లపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవ ల్ని అందించారు. పీహెచ్‌సీ వైద్యులు పి. రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు 144 మందికి వైద్యసేవలం దించారు. రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందుల్ని అందించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎం పీపీ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందుల్ని అందిం చారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్ర మంలో ఎంఎల్‌హెచ్‌పీ రహమున్నీసా, సూపర్‌వై జర్లు జోస్పిన్‌రాణి, భవానీకుమారి, ఏఎన్ఎం మస్తాన్‌బీ, డీఈఓ రవితేజ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లీగల్ అడ్వైజర్‌గా గోవిందాచారి నియామకం



సత్తెనపల్లి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ ఏపీ స్టేట్ లీగల్ సలహాదారుడిగా పల్నాడు జిల్లా సత్తెనప ల్లి పట్టణానికి చెందిన యువ న్యాయవాది కోటగిరి లక్ష్మణ గోవిందాచా రిని ఆ సంస్థ ప్రెసిడెంట్ కె. గోపీ ప్రసన్న కుమార్ నియమించారు. ఈ మేరకు గోవిందాచారి నియామక ఉత్వర్వులు అందుకున్నారు. 2024 జనవరి వరకు పదవిలో ఉంటాన ని, ప్రజలకు మరింత సేవ చేయడంలో బాధ్యతగా ఉంటానని తెలిపారు. ఈ సం దర్భంగా పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది బుధవారం గోవిందాచా రిని ప్రత్యేకంగా అభినందించారు.